


కథ

పోడూరి కృష్ణకుమారి

# కొంచెం తూర్పు కొంచెం పడమర

"ఏవిటే వెంకటలక్ష్మీ శనివారం పూటా ఇంతా లీసం.. వీధిగుమ్మం ఇప్పటి దాకా.." అంటూ తల్లి శాంతమ్మ సాగిస్తున్న సుప్రభాతం నేపథ్యంలో పళ్లు తోముకోడం లాంటి పనులు చేసుకుంటోంది ఇందిర. ఆ రోజు శనివారం. స్కూలుకు శలవ రోజు కాబట్టి రూలు ప్రకారం ఎవరూ లేవకుండానే అందరి కంటే ముందు లేచేసిన పిల్లలు నలుగురూ వెంకటలక్ష్మి చేతిలోంచి మగ్గు లాక్కుని ఎడాపెడా నీళ్లు చల్లేసి "ఇప్పుడెయ్యి ముగ్గు" అని ఆమె వేళ్ల సందుల్లోంచి గారడీలా రూపుదిద్దుకుంటున్న ముగ్గుని వింతగా చూస్తున్నారు. అందరినీ ఇందిర లోపలికి పిలుచుకొచ్చి పాలు కలిపిచ్చింది. ఆ నలుగురిలో రాము, రమణి, ఇందిర చిన్నన్న పిల్లలైతే, వేణు, రమ్య పెద్దన్న పిల్లలు.

బల్లమీద వరసగా ఉన్న పాలగ్లాసులు చూస్తూ "చెల్లాయ్, ఇది మనం నిన్న తాగిన మోస్ట్ ప్లస్ ప్లస్ ఎనర్జీ డ్రింకు కాదే. వేస్ట్ మైనస్ మైనస్ డ్రింకు. ఇది తాగితే నీకు బలం రాదు" అన్నాడు రాము. వాడు తంపులు పెట్టడంలో నారదుడికి వారసుడు. ఐదేళ్ల రమణి తన పౌరహక్కులకేదో భంగం కలిగిందని గ్రహించి బ్యారుమని ఏడుపు లంకించుకుంది. రాము ఆనందానికి అవధులు లేవు.

"రాముడు కాదమ్మా రావణుడు పుట్టుకొచ్చాడు పొద్దున్నే మనశ్శాంతి లేకుండా..." ఎట్సెట్రాలతో శాంతమ్మ అష్టోత్తరం రమణి ఆరున్నొక్క రాగానికి జతై జుగల్ బందీ జరుగుతుండగా వేణు ఐడియా వేసి, "కాదే చెల్లాయ్ నిన్న మిగిలిన ప్లస్ ప్లస్‌తో నీకు పాలు కలిపి మాకు మాత్రం మైనస్ మైనస్ డ్రింకు కలిపిచ్చింది ఇందిరత్త" అని చక్రం అడ్డువేశాడు.

రమణి టక్కున ఏడుపాపి వేణు మాట మీద విశ్వాసం ఉంచి గడగడా పాలు తాగేసింది. వేణు సమయస్ఫూర్తికి నవ్వుకుంది ఇందిర.

శాంతమ్మ మళ్లీ తన బాణాలు వెంకటలక్ష్మి ఆలస్యం మీద ఎక్కుపెట్టింది. "పోన్లెండత్తయ్యగారూ, అసలంటూ పన్లోకొచ్చింది ఇంక దాన్నొదిలెయ్యండి" అంది ఇందిర చిన్న వదిన సుజాత గుసగుసగా.

శాంతమ్మ వినవిసా హాల్లోకి నడిచి అక్కడున్న పతిదేవుడితో "చూశారా నా మీదే పెత్తనం చలాయిస్తుంది మీ కోడలు. అసలు నేను పెళ్లి చూపుల్నాడే చెప్పాను. పిల్ల కొంచెం గయ్యాళిలాగుంది ఈ సమ్మందం వద్దూ అని. విన్నారా?" అంటూ గతజలసేతుబంధనం చేస్తుంటే ఆయన ఎందుకో గట్టిగా గొంతు సవరించుకుని, కొంచెం దగ్గి, ఆ మూలనున్న స్టూలు ఈ మూలకి జరిపి, అల్మైరా తలుపు తెరిచి లేని వస్తువేదో వెతుక్కుని, ఉన్నట్టుండి చెప్పులు తొడుక్కుని రోడ్డుమీదకెళ్లిపోయాడు.


శతకోటి సతాయింపులకి అనంతకోటి ముక్తాయింపులు.


శాంతమ్మగారి సాధింపులు, వెంకటలక్ష్మి రిటార్టులు, సుజాత సన్నాయి నొక్కులూ, పెరటి కుళాయి దగ్గర మగపిల్లలిద్దరూ హింసాత్మకంగా ఆడుతున్న జలకాలాటలూ బృంద నేపథ్యగానం అందిస్తుండగా తన పనులు ముగించుకుని వంటావిడ వచ్చేలోగా జరగాల్సిన ఇంటి పనుల్లో వీలయినంత సాయం చేసి ఆఫీసుకు బయల్దేరింది ఇందిర.

అది మహా నగరంగా విస్తరించడానికి ఇంకా సంకోచిస్తున్న ఓ మోస్తరు పట్టణం. ఇందిర అరగంట పాటు నడిస్తే ఆమె పని చేసే ఆఫీసుకు చేరుకోగలదు. నడుస్తూ ఆలోచించింది ఇందిర. డెబ్బై ఏళ్ల శాంతమ్మ సుదీర్ఘమైన వైవాహిక జీవితంలో అసంతృప్తులు అనంతంగా ఉన్నాయి. వాటిలో దీర్ఘకాలిక అసంతృప్తి. ఇందిర పెళ్లి చేసుకోనని భీష్మించిందని. నిరంతర రోజువారీ అసంతృప్తి కూతురూ, కోడళ్లూ కొడుకులతో సమానంగా టింగురంగామనుకుంటూ ఉద్యోగాలన్చెప్పి పోతారు. ఇంక ఇల్లూ పిల్లలూ బాధ్యత నా నెత్తినే. ఇంత వయసొచ్చినా విశ్రాంతి లేదు అన్నది. అదీ నిజం కాదని అందరికీ తెలుసు. సుజాత స్కూలు టీచరు, పిల్లలతో పాటు సెలవులుంటూనే ఉంటాయి. ఇంక వంటావిడ వచ్చిందంటే రాత్రి దాకా ఇంట్లోనే ఉండి పై పనులన్నీ చేస్తుంది. పిల్లలనీ సవరిస్తుంది. శాంతమ్మకి నిజంగా శ్రమ లేనే లేదు. కానీ దేనికీ తృప్తి పడకపోవడం ఆవిడ జన్మకణాలతో వచ్చిన లక్షణం. అంతరంలో అసంతృప్తుల ఘోష అణిచేందుకు ఆవిడ అలా ఎవరో ఒకరి మీద విరుచుకు పడుతూనే ఉంటుందన్న నిజం అందరికీ తెలుసు. అందుకే ఎవరూ ఆవిడ మాటలకి అంతగా స్పందించరు. దగ్గర దారి అని తను రోజూ వెళ్లే చిన్న సందులోకి తిరగబోతూ టక్కున ఆగింది ఇందిర. అక్కడ ఆ సందు కుక్కలు మూడు, పక్క సందు కుక్కలు మూడు కలిసి సరిహద్దు తగాదాల్లో గొంతులు చించుకుని అరుస్తున్నాయి. ఆ గ్రామ సింహాల మధ్య నించి వెళ్లే సాహసం లేక ఏదైనా రిక్షా కనిపిస్తుందేమో చుట్టూతిరిగి దారిలో వెళ్లిపోవచ్చుని చూసింది. ఇంతలో మరో వింత జరిగింది. సందుకి ఆ చివర్నించీ ఈ చివర్నించీ రెండు బైక్‌లు ఎదురూబొదురూ వచ్చి డేష్ కొట్టుకుని ధామ్మని పడ్డాయి. చోదకులు ఇద్దరూ లేచి నిలబడి తమతమ వాహనాలని లేవనెత్తారు. బట్టలమీద కొద్దిగా మట్టి అంటుకోవడం తప్ప ఎవరికీ దెబ్బలు తగల్లేదు. వాహనాలూ కులాసా. అయినా కూడా ఇద్దరూ గొంతు చించుకున్నారు. 'ఏం కళ్లు మూసుకుపోయి నడుపుతున్నావా?' 'రోడ్డేమైనా నీ బాబు గాడి సొమ్మనుకున్నావా?'తో మొదలుపెట్టి ఇద్దరూ అవతలి వాడి ఏడుతరాల ఏన్సెస్టర్సూ ఎవరెవరికి పుట్టారో విప్పి చెప్పడం మొదలెట్టారు. అప్పటిదాకా కంఠనాళాలు తెగిపోయేలా అరుచుకున్న ఆరు కుక్కలూ బిక్కచచ్చి పోయి చూశాయి. ఇంక తమకిక్కడ అవకాశం లేదనుకున్నాయో ఏమో వేరే సందు వెతుక్కోడానికి కలసికట్టుగా పోయాయి.

సైకిళ్ల మీద ఓ ఇద్దరు నూనూగుమీసాల నూతన కాలేజీ కుర్రాళ్లు పోతూపోతూ "అంకుల్ మీ బైక్కే ఎక్కువ డామేజయింది" అని ఇద్దరితోనూ చెప్పి వాళ్ల యుద్ధాగ్నికి రెండు సమిధలు సమర్పించి నవ్వుకుంటూ పోయారు. వీళ్లు ఇంకా రెచ్చిపోయి రాబోయే ఏడు తరాల వారసులూ ఎవరికి ఎలా పుట్టబోతారో వివరించుకోడంలో పడ్డారు. ఓ పదిపన్నెండేళ్ల కుర్రాడొకడు భుజం మీద క్రికెట్ బేట్ గదలా ధరించి సందులోకి తిరిగాడు. వాడు అరుచుకుంటున్న బైకుస్ట్రైకర్స్‌ని వింతగా చూస్తూ కాసేపు నిలబడ్డాడు.

ఓ నిముషం అయ్యాక "అంకుల్ అంకుల్! పోలీసులు" అన్నాడు భయం భయంగా. అంకుల్లిద్దరూ హడావిడిగా ఎవరి బైక్ వాళ్లెక్కేసి "నిన్నొదిలిపెడతాననుకోకు, నీ అంతు చూడకుండా వదల్ను" అని వాగ్దానాలు చేసుకుని ఎవరి దారిన వాళ్లు పోయారు. పిల్లాడు ఇందిరకేసి చూసి పగలబడి నవ్వుతూ వెళ్లిపోయాడు. ఈ దండుగండు పిల్లల పోరు పిట్టంత పిల్లాడు తీర్చాడు అనుకుని నవ్వుకుంటూ ఆఫీసు దారి పట్టింది ఇందిర. ఆఫీసు తన సెక్షన్‌లో అడుగుపెట్టగానే అరుణాదేవి అరుపులు వినిపించాయి. "ఏవిటండీ ఈ రాజారావు సంగతీ? సగం రోజులు సెలవులో ఉంటాడు వస్తే ఎప్పుడూ లేటుగానే





వస్తాడు. వచ్చీ రాగానే ముందు ఫేనార్పేస్తాడు. ఉక్కపోసి చచ్చేది నేను, అతనికి అక్కర్లేకపోతే ఇంకెవరికీ ఫేనవసరం లేదనుకుంటాడు. ఆ ఆపే ముందు అడగడం ఉండదు. నాక్కుదరదండి. నా సీటు ఇక్కడి నించి మార్చెయ్యండి. లేదా అతని సీటయినా మార్చండి. లేదా నేను నా సొంత టేబుల్ ఫ్యానొకటి తెచ్చి పెట్టుకుంటాను" అంటోంది.

సెక్షను హెడ్డుగారు ముక్కోటి దేవతలకీ మొక్కుకుంటున్న వాడిలా మొహం పెట్టుకుని ఎవరైనా రక్షిస్తే బాగుండునన్నట్టు చూస్తున్నాడు. "మన సామాను మనం ఆఫీసులో తెచ్చిపెట్టుకోడానికి రూల్స్ ఒప్పుకోవనుకుంటానమ్మా" హెడ్డుగారి మాట పూర్తికాకుండానే అరుణ అందుకుంది. "అ... ఆమాత్రం దానికి రూల్స్ ఒప్పుకోవుగానీ రాజారావు ఎగ్గొట్టిన పనంతా నాచేత చేయించడానికి మాత్రం ఒప్పుకుంటాయి రూల్స్" కచ్చగా అంది అరుణ.

"అదుగో మన ఇందిరా మేడమ్ వచ్చేశారు. ఆవిడనడుగుదాం మీ సమస్యకి పరిష్కారం" అన్నాడు హెడ్డుగారు భారం ఇందిర హెడ్డు మీదకి నెట్టేద్దాం అన్న ధోరణితో.

"అబ్బో ఆవిడగారో మహా ముంగి. తనకేదో ప్రయోజనం లేకపోతే నోరే ఇప్పుడావిడ" అక్కసుగా అరిచింది అరుణ.

ఆఫీసులో అందరూ బిత్తరపోయారు. ఇందిరేం జవాబిస్తుందోనని ఉత్కంఠగా చూశారు. కాసేపు పిన్ను పడిన నిశ్శబ్దం.

ఇందిరకి కోపం సర్రున లేచింది. కానీ ఇందిరకి తెలుసు. మాటకి మాట అడవికి అగ్గిలాంటిది. అంటుకుంటే ఆగదు, ఆరదు. ఆ అగ్గిని మొగ్గలోనే తుంచేసే గ్రగ్గు మౌనం. అందుకే అప్పటికా మందు వేసింది ఇందిర. మాటా పలుకూ లేకుండా చెక్కలా మొహం పెట్టుకుని తన పనిలో మునిగిపోయిన ఇందిరని చూస్తుంటే తన చేత్తో తనే ఇంత కారం తీసుకుని తనకి తనే తన ఒంటికి పట్టించుకుంటున్న అనుభూతి కలిగింది అరుణాదేవికి.

ఆ సాయంకాలం ఆఫీసు అయిపోయాక "కేంటీన్లో కాఫీ తాగి పోదాం వస్తావా?" అడిగింది కమల.

కేంటీన్లో కూచున్నాక "అసలు నువ్వు ముంగివే కానీ ఇవాళ మటుకు అరుణ చెప్పినట్లు మహాముంగిలా ఉన్నావు ఏంటి సంగతి?" అని అడిగింది కమల.

ఇందిర పొద్దున్నించీ జరిగిన

ఇంట్లో రామాయణం, వీధిలో బైక్ భాగోతం అన్నీ ఏకరువు పెట్టింది. "మా అమ్మ, ఆవిడ వయసు వాళ్లెవరైనా కలిస్తే చాలు మన రోజులనాటి ఆప్యాయతలు ప్రేమలూ ఈ రోజుల్లో లేనే లేవు అన్న టాపిక్ మీద గంటల తరబడి మాటాడి మనలాంటి వాళ్లని ఆడిపోసుకుంటూంటారు. కానీ ఆవిడ మా ఇంట్లో ఎవరితోనైనా కాస్త ప్రేమగా ఆప్యాయంగా మాటాడగా ఈమధ్య కాలంలో నేనైతే చూడలేదు. అసలు కన్నా వడ్డీ ముద్దని సామెతలు చెప్పడమే గానీ ఆవిడ మనవల పట్ల ముద్దుకాదు కదా కాస్తంత సహనం చూపించడం కూడా నేను చూడలేదు. మా ఇంట్లోనే కాదు అసలు ప్రపంచం అంతా అలాగే ఉన్నట్టుంది. ఇందాక బైక్ వాళ్లే చూడు. ఎవరికీ ఏ నష్టమూ జరగలేదని సంతోషించడం పోయి కాట్లకుక్కల కన్నా హీనంగా అరుచుకున్నారు. ఏమైపోతోంది ప్రపంచం అనిపిస్తుంది" దిగులుగా అంది.

"నువ్వు మరీ సెన్సిటివ్. ఇవన్నీ పట్టించుకోకు. మనసు పాడైపోతుంది. ఎవరి మానాన వాళ్లుండడమే"

"ప్రస్తుతం జరుగుతున్నదదే. నో మేన్ కెన్ బి ఏన్ ఐలెండ్ అని అంటారు కానీ ఎవ్విరి వుమన్ కెన్ సర్టెన్లీ బీ ఏన్ ఐలెండ్. ఎవరి మానాన్న వాళ్లం ద్వీపాల్లాగా ఊహా ద్వీపాలు సృష్టించుకుని వాటిల్లో బతుకుతున్నాం. అందరం కలిసి ఒకే ఇంట్లో ఉంటూనే. మా భారతీయ ఉమ్మడి కుటుంబాలకి సాటి లేదు అని మన గొప్పలు మనం చెప్పుకోడమే. కానీ అంతా పైన పటారం" అంది ఇందిర. కమల మాటాడలేదు.

"ఇందాక అరుణ సంగతే చూడు. ఆవిడంతగా నోరు పారేసుకోకుండా సామరస్యంగా ఆ సమస్య పరిష్కారం ఆలోచించవచ్చు. కానీ ఎవరూ అలా చెయ్యరు. కేకలు పెట్టే గొడవ చేస్తేనే తృప్తి"

"కానీ నీ రియాక్షను బాగుంది. నిమ్మకి నీరెత్తినట్టు మహర్షిలాగా మహా మౌనంగా కూచున్నావులే"

"ఇంట్లో రోజు చేసేదదే కదా. ఏ సన్యాసుల మఠంలోనైనా సరే మా ఇంట్లో కంటే బెటర్ హ్యూమన్ ఇంటరాక్షన్ మెరుగైన మానవసంబంధాలుంటాయేమో గానీ మా ఇల్లు మాత్రం తామరాకులమీద నీటిబొట్లతో నిండిపోయింది. ఎవరి తామరాకు వాళ్లదే"

ఇందిర మాటలకి ఏడవలేనట్టు నవ్వింది కమల. "ఎందుకోయ్ అంత బిట్టర్నెస్? నువ్వు పైకి చెప్తున్నావ్. మా లాంటి వాళ్లం చెప్పుకోలేక మింగలేక కక్కలేక బతికేస్తున్నాం. బహుశా ఇది కూడా గ్లోబల్ వార్మింగ్ దెబ్బయ్యుంటుంది. పర్యావరణం వేడెక్కిపోయి మనుషులు పొగలూ సెగలూ కక్కుకుంటున్నారనుకుంటా" ఇందిర నవ్వింది.

"ఇలా నవ్వేసుకుని సద్ది చెప్పుకోవాల్సిందే" ఇద్దరూ లేచి రోడ్డెక్కారు.

ఓ వారం గడిచిపోయింది. మళ్లీ శనివారం వచ్చింది. "ఆరయ్యింది. ఏడున్నర కూడా అవుతుంది. ఎవ్వరూ లేవరు. ఆ వెంకటలక్ష్మింకా రాలేదు" మొదలైన శాంతమ్మగారి సణుగుడు సుప్రభాతం నేపథ్యం అందిస్తుండగా ముఖం కడుక్కుని ఇవతలకొచ్చింది ఇందిర.


"బామ్మా డోంట్ యూ వర్రీ.. మేం వీధిగుమ్మంలో ముగ్గేసేశాం" రాము కేక పెట్టాడు. వీధి మెట్ల ముందు తడితడిగా ఉన్న నేలమీద ఓ మిక్కీ మౌస్ ముగ్గుగా వెలిసింది. కొంచెం వంకరగా ఉన్నా ముద్దొస్తోందది. రాము, వేణు గర్వంగా నవ్వారు.

పై మెట్టు మీద నిలబడి మిక్కీ మౌస్ ముగ్గుకేసి అవాక్కై చూస్తున్న శాంతమ్మని చేతుల్తో చుట్టేసి "బామ్మా పదపద ఇలారా ఇక్కడ కూచో" శాంతమ్మని తీసుకొచ్చి సోఫాలో కూచోబెట్టారు. అక్కడే నుంచుని వింతగా చూస్తున్న తాతని కూడా లాక్కొచ్చి బామ్మ పక్కన కుదేశారు. ఇద్దరినీ కలిపి చేతుల్తో బంధించి "హేపీ వేలంటైన్స్ డే బామ్మా అండ్ తాతా!" పాడారు రాము, వేణు. అప్పుడే లేచొస్తున్న రమణి, రమ్య "ఏంటి ఇవాళ వీళ్లిద్దరికీ బర్త్‌డేనా లేకపోతే మేరేజా?" అంటూ పరిగెత్తుకొచ్చి సోఫా వెనకెక్కి బామ్మతాతల కంఠాలు కావలించుకున్నారు. "అబ్బబ్బ ఉండద్రా నడుం విరగ్గొట్టేస్తున్నారు" అని కేకలు పెట్టకుండా "ఏవిట్రా హడావిడీ నా బంగారు కొండలూ!" అంటూ వాళ్లని మరింత హత్తుకుంది శాంతమ్మ ఆ అమాయకపు చిన్నారుల ప్రేమామృతవర్షంలో తడిసి ముద్దయిపోతూ.

పిల్లల కేరింతలూ, తాతగారి నవ్వులూ విని ఇంట్లో ఉన్న మిగతా నీటిబొట్లు కూడా నిద్రలేచి తమ తమ తామరాకులు వదిలొచ్చి సోఫా చుట్టూ చేరారు. నీటిబొట్లన్నీ కలిపి చల్లని సంసారకాసారంలా కళకళలాడిందా యిల్లు ఆ సమయంలో.

తెలిసీ తెలియని ఆ పిల్లలది సరదా మాత్రమే. పెద్దలకి మాత్రం ఉన్నట్టుండి ఎడారిలో వసంతం వచ్చినట్టు, మండుటెండలో చిరుజల్లులు పలకరించినట్టూ ఉంది.

"భారతీయ సంప్రదాయాలు, ఉమ్మడి కుటుంబాలు, నైతికవిలువలూ చాలా గొప్పవే. కానీ అవి కూడా అప్పుడప్పుడు ఖాయిలా పడుతుంటాయి. అలాంటప్పుడు తగు మోతాదులో కాసిని విదేశీ వేడుకల సూది మందు వేస్తే మళ్లీ పటిష్టంగా నిలబడతాయి గాబోలు. పర్యావరణ పరిరక్షణైనా మానవసంబంధాలు మెరుగుపరచడమైనా ఇంక సిసింద్రీల్లాంటి భావిపౌరుల చేతుల్లోనే ఉంది" అని ఇందిర అనుకుంటే ఒప్పుకోక తప్పదు కదా.



## ఉచిత సలహాలు నచ్చవ్

బొద్దుగుమ్మ నమితకి ఉచితంగా సలహాలు ఇవ్వడమన్నా, తీసుకోవడమన్నా అస్సలు నచ్చదుట. ఒక సలహా ఇచ్చేముందు దాన్ని మనం ఎంతవరకూ పాటిస్తున్నాం అనేది ఆలోచించి సలహా ఇవ్వాలంటుంది ఆమె. తను కూడా అంతేనట. తను ఎవరికీ అనవసరంగా సలహాలివ్వదట. తను ఫాలో అయ్యేవే తను చెప్తుంది కానీ, తను చేయకుండా ఇతరులకు మాత్రం ఇలా చేయండి, అలా చేయండి అంటూ గొప్పగా సలహాలు ఇచ్చిపారేయడం గొప్ప కాదని భావిస్తుందిట నమిత. మంచి ఆలోచనే కదూ!